వృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి

వృద్ధులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జడ్జి రమేశ్

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 1: వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి రమేశ్‌తో కలిసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధాప్యం శరీరానికే కాని మనసుకు కాదని, వారి అనుభవం యువతకు ఆదర్శం అన్నారు. సామాజిక సేవలు అందిస్తున్న 12 మంది వృద్ధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి లలితాకుమారి, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవి, మెప్మా పీడీ గీత పాల్గొన్నారు.

పంటలెండుతుంటే పట్టించుకోరా?

ఎమ్మెల్యే తీరుపై మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆగ్రహం

నల్లవాగు ప్రాజెక్టు వద్ద రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

సిర్గాపూర్, అక్టోబర్ 1: నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతులపై ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తూ ప్రాజెక్టు కింద పంటలను ఎండబెడుతున్నాడని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన నల్లవాగు ప్రాజెక్టును సందర్శించి మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మించిన 57 ఏండ్లలో గత ప్రభుత్వాలు ఎప్పుడూ రెండు పంటలకు నీరందించలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న రెండు పర్యాయాలు మాత్రమే పూర్తి ఆయకట్టు రెండు పంటలకు సాగు నీళ్లు అందించానని తెలిపారు. ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లు ఉన్నా ప్రస్తుత ఎమ్మెల్యే కుడి కాల్వకు నీరు విడుదల చేయకుండా సిర్గాపూర్, కల్హేర్ మండలాల్లోని పంటలను ఎండబెడుతున్నాడని, ఎడమ కాల్వల ద్వారా నీరు విడుదల చేసి కామారెడ్డి జిల్లా పిట్లం మండలాల్లో సాగుకు అవకాశమం కల్పించడమేమటని ప్రశ్నించారు. అక్కడున్న జుక్కల్ ఎమ్మెల్యే ఇక్కడి నీళ్లు తీసుకెళ్లి అక్కడి పంటలకు నీరందజేసుస్తుంటే ఇక్కడున్న ఎమ్మెల్యే చేతగాని తనంతో ఇక్కడి పంటలు ఎండిపోతున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో చివరి ఆయకుట్టు వరకు ప్రతి ఏడాది 6,200 ఎకరాలకు సాగునీరిచ్చి, రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, నాయకులు రాంసింగ్, మల్గొండ ఉన్నారు.

సంగారెడ్డి పీఆర్‌పల్లిలో బస్సుల కోసం విద్యార్థులు, తల్లిదండ్రుల అగచాట్లు

దసరా సెలవులొచ్చాయ్..

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 1: నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థులకు దసరా సెలవులు ఉత్సాహాన్ని నింపాయి. బుధవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు రెండు వారాల పాటు సెలవులను ప్రకటిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 12న దసరా పండగ ఉండగా, మరుసటి రెండు రోజులు కూడా ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. హాస్టల్ విద్యార్థులు మంగళవారం తట్టాబుట్టా సర్దుకొని ఇంటిబాట పట్టారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ఇదే అదనుగా ఇబ్బడిముబ్బడిగా హోమ్ వర్క్ ఇచ్చి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయరాదని విద్యాశాఖ ఆదేశించింది. ఎక్కడైనా, ఎవరైనా సెలవు రోజుల్లో పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు తప్పవని డీఈవో హెచ్చరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు ఈ నెల 2 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించారు. ఈ నెల 14న కళాశాలలు పున: ప్రారంభం కానుండగా, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఈ నెల 15న పున:ప్రారంభం కానున్నాయి.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

అందోల్, అక్టోబర్ 1: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు వారికి కావాల్సిన వసతులు కల్పించాలని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్ అన్నారు. మంగళవారం పోసానిపేటలో పర్యటించారు. పలు అభివృద్ధి పనులను పరిశీలించడంతోపాటు పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న బతుకమ్మ వేడుకలను తిలకించి మహిళలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో అశోక్, ఎంఈవో కృష్ణ ఉన్నారు.

కాలనీల్లో సమస్యలను పరిష్కరిస్తాం

మురుగు కాల్వలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, అక్టోబర్ 1: పటాన్‌చెరు డివిజన్ 113లోని కాలనీల్లో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పర్యటించారు. శ్రీనగర్‌కాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని స్థానికులు చెప్పడంతో మున్సిపల్ సిబ్బందిని పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. పలు చోట్ల వ్యర్థాలతో డ్రైనేజీలు పూడుకుపోయాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. తక్షణం మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పూడికతీత పనులు నిర్వహించాలని జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులను కార్పొరేటర్ కోరారు. పలు కాలనీవాసులు తమ కాలనీల్లో మురుగు వెళ్లడం లేదని చెప్పడంతో ఆయా కాలనీల డ్రైనేజీలను పరిశీలించారు. కొత్తగా నిర్మించాల్సిన డ్రైనేజీల వివరాలను అధికారులకు వివరించారు.

నివాళులర్పిస్తున్న జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

చందు మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు

జహీరాబాద్, అక్టోబర్ 1: బీఆర్ఎస్ జహీరాబాద్ నేత ముత్యాల చందు అకాల మృతి పార్టీకి తీరని లోటని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఈదులపల్లి శివకుమార్ అన్నారు. మంగళవారం ఇంటి పార్టీ నాయకులతో కలిసి వెళ్లి భౌతికాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీకి ముత్యాల చందు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం ఆయన అంతిమ యాత్రలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డీఆర్‌యూసీసీ మెంబర్ షేక్‌ఫరీద్, నాయకులు పెంటారెడ్డి, తంజీం, నామ రవికిరణ్, తట్టు నారాయణ, యాకూబ్, మొహిజోద్దీన్, మచ్చేందర్, బండి మోహన్, హీరు రాథోడ్, శివప్ప, చిన్నరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తులసీదాస్‌గుప్తా, దత్తాత్రి, పాండు, విజయ్ రాథోడ్, ఖలీం, నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

కేటీఆర్ వాహనంపై దాడిని ఖండిస్తున్నాం

జోగిపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

అందోల్, అక్టోబర్ 1: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ప్రజలు అండగా నిలబడుతుండడంతో కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతున్నదని, అందులో భాగంగానే కేటీఆర్ వాహనంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని జోగిపేట ఏఎంసీ మాజీ చైర్మన్ నాగభూషణం, పార్టీ పట్టణ అధ్యక్షుడు సార శ్రీధర్ ఆరోపించారు. మంగళవారం జోగిపేటలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ కేటీఆర్ వాహనంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలతోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, దీంతో బీఆర్ఎస్‌పై దాడులకు పాల్పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఉద్యమాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందన్నారు. కాంగ్రెస్ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని హెచ్చరించారు. అంతకుముందు జోగిపేటలో తెలంగాణ అమరుడు రవీందర్ 13వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశం, మొగులయ్య, బీర్ల శంకర్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛభారత్

జహీరాబాద్, అక్టోబర్ 1: జహీరాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జహీరాబాద్ రిలయన్స్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్‌లో రిలయన్స్, రైల్వే అధికారులు, సిబ్బంది కలిసి పరిసరాల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మాస్టర్ మాధవకృష్ణ, రిలయన్స్ మేనేజర్ క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

టీఎస్‌యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

గుమ్మడిదల, అక్టోబర్ 1: టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా వినోద్‌కుమార్‌ను ఆ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం మండలంలోని బొంతపల్లి పాఠశాలలో సంఘం రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సమావేశంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్.వినోద్‌కుమార్(నాగిరెడ్డిగూడెం), ఉపాధ్యక్షులుగా యేసుపాదం, పెంచలయ్య, ప్రధానకార్యదర్శిగా ముహ్మద్ అబ్దుల్లాహ్(బొంతపల్లి), కోశాధికారిగా ఎస్.భాస్కర్‌రావు, కార్యదర్శులుగా చంద్రకళ(గుమ్మడిదల), బాబురావు(నల్లవల్లి), సయ్యద్‌రహ్మతుల్లా హుస్సేని, అప్పిరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, కార్పొరేట్ విద్యావిధానాన్ని తొలిగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు జ్ఞానమంజరి, జిల్లా అధ్యక్షుడు కంబపురం అశోక్, కార్యదర్శి అమరేశ్వరి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ కార్యవర్గం ఎన్నిక

కల్హేర్, అక్టోబర్ 1: పీఆర్‌టీయూ టీఎస్ కల్హేర్ మండల కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రామ్మోహన్‌రావు, గౌరవాధ్యక్షుడిగా గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా వంశీకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడిగా సంజీవ్‌కుమార్, కార్యదర్శులుగా హన్మంత్‌రావు, శివ, భార్గవ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా స్నేహ ఎన్నికయ్యారు. అనంతరం మండలానికి నూతనంగా విద్యాధికారిగా నియమితులైన శ్రీనివాసులును పీఆర్‌టీయూ టీఎస్ నూతన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

నల్ల బ్యాడ్జీలతో ఏఈవోల నిరసన

నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వ్యవసాయ విస్తరణ అధికారులు

జహీరాబాద్, అక్టోబర్ 1: డిజిటల్ క్రాప్ సర్వే నుంచి ఏఈవోలను మినహాయించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ఏఈవో సంఘం పిలుపు మేరకు మంగళవారం మండలంలోని రంజోల్ రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు నల్ల బ్యాడ్జీలతో హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలను విరామం లేకుండా చేపడుతున్నామన్నారు. సరైన వసతులు, సౌకర్యాలు లేకుండా డిజిటల్ క్రాప్ సర్వే(బుక్కింగ్) చేయాలంటే ఇబ్బందులు తప్పవని వాపోయారు. ప్రతి రైతు పొలానికి వెళ్లి క్రాప్ సర్వే చేయడం కష్టంగా మారుతుందన్నారు. వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించినట్లు ఇక్కడ కూడా ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం సలహాదారులు ప్రవీణ్‌కుమార్, నాయకులు రాజు, వీరేందర్, ఏఈవోలు స్రవంతి, శ్రీప్రియ పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో గుడిసెలను కూల్చొద్దు

సంగారెడ్డి, అక్టోబర్ 1: ప్రభుత్వం హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చివేయడం సమంజసం కాదని, పేదలకు పక్కా ఇండ్లు నిర్మించి ఇచ్చాకే కూల్చివేతలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు అన్నారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమీవేశంలో మాట్లాడుతూ హైడ్రా పేరుతో పేదల జీవితాలతో ఆడుకోవద్దని కోరారు. 2002 నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తే అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించి అనుమతులిచ్చారని ఆరోపించారు. చెరువులు, నాళాలు, కుంటలను ప్లాట్లుగా మార్చి ప్రజలకు అమ్మిన వారిపై చర్యలు తీ సుకొని జైల్లో పెట్టాలన్నారు. నాయకులు నర్సింలు, రాజయ్య, నర్సింహారెడ్డి, అశోక్, మహేశ్, వినోద, నాగేశ్, అనురాధ, ఆవన్నగౌడ శ్రీధర్ మహేంద్ర, మహబూబ్ ఖాన్, ముజాహిద్, రాజు, నరిసింహులు పాల్గొన్నారు.

ఒకరిపై మరొకరి ఫిర్యాదు

కల్హేర్, అక్టోబర్ 1: బ్లాక్‌మెయిల్ చేస్తూ వివాహితపై లైంగిక దాడికి యత్నించిన యువకుడిపై, తన కుమారుడిని కిడ్నాప్ చేశారనే ఆరోపణతో నలుగురిపై కేసు నమోదైంది. ఎస్ఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. కల్హేర్ గ్రామానికి చెందిన షర్ఫొద్దీన్ అదే గ్రామానికి చెందిన పిట్ల స్వర్ణను ఫొటోలు, వీడియో తీసి శారీరకంగా వేధిస్తూ లైంగిక దాడికి యత్నించాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తన కుమారుడు షర్ఫొద్దీన్‌ను పిట్ల కుమార్, ఆయన ముగ్గురు బావమర్దులు కలిసి కారులో కిడ్నాప్ చేసి కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడ వదిలి వేశారని తండ్రి ఫయుమొద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో ఎలాంటి గొడవలు తలెత్తకుండా కంగ్టి సీఐ ఆధ్వర్యంలో నారాయణఖేడ్, సిర్గాపూర్, కంగ్టి ఎస్ఐలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కరెంట్ షాక్‌తో యువకుడి మృతి

అందోల్, అక్టోబర్ 1: ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగలడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అన్నాసాగర్‌లో జరిగింది. జోగిపేట ఎస్సై పాండు తెలిపిన వివరాల ప్రాకారం.. అన్నాసాగర్‌కు చెందిన ఎర్రంకి నర్సింహులు(28) గ్రామంలోని కట్టెల మిషన్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం పనికి వెళ్లిన నర్సింహులు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగలడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి లచ్చమ్మ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

పండుగలను ఘనంగా నిర్వహిస్తాం

రామచంద్రాపురం, అక్టోబర్ 1: ప్రతి ఏడాదిలాగే ఆర్సీపురం సండే మార్కెట్ ప్రాంగణంలో సద్దుల బతుకమ్మ వేడుకలు, విజయ దశమి సందర్భంగా రావణ దహన ఖాండను ఘనంగా నిర్వహిస్తామని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ తెలిపారు. మంగళవారం శ్రీనివాస్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో బాలకృష్ణ పంతులు 9వ తేదీన బతుకమ్మ, 12వ తేదీన దసరా పండుగను జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంజయ్య, లక్ష్మణ్, కె.సత్యనారాయణ, ఐలేశ్, రమేశ్, భిక్షపతి, నర్సింహారెడ్డి, రమేశ్, సాయిలు, మహేందర్‌రెడ్డి, నవీన్, శ్రీను, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన

బకెట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

కంది, అక్టోబర్ 1: పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపగలమని, ప్రతిఒక్కరూ శుభ్రతను పాటించాలని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా డిగ్రీ కళాశాల(హైదరాబాద్) బృందం సభ్యులు అన్నారు. మంగళవారం కంది తండాలో పర్యటించి శుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంట్లోని చెత్తను ఇష్టారీతిగా పడేయవద్దన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసేందుకు ప్లాస్టిక్ బకెట్లను పంపిణీ చేశారు. ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రూపాలి, నాయకుడు సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కల్హేర్, అక్టోబర్ 1: నారాయణఖేడ్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ నూతన్‌కుమార్ బాచేపల్లిలో సాగవుతున్న వరి, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఇటీవల కురిసిన వానలకు వరిలో కంకినల్లి ఉధృతి ఉందని గుర్తించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈవోలు భాస్కర్, వంశి ఉన్నారు.

జిన్నారం జూనియర్ కాలేజీ అభివృద్ధికి కృషి

విద్యార్థిని అభినందిస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

జిన్నారం, అక్టోబర్ 1: జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు హాజరయ్యారు. విద్య, వైజ్ఞానిక, సాహిత్య కళావేదికలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఐడీ కార్డులు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. కళాశాల సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణకుమార్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ వైస్ ఎంపీపీ గంగు రమేశ్, సీఐ సుధీర్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, మాజీ ఎంపీటీసీ జనాబాయి, జిన్నారం మాజీ వైస్ ఎంపీపీ నాగేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి

బొల్లారం అక్టోబర్ 1: మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు పోచమ్మ బస్తీలో రూ.50 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం 21వ వార్డు వెంకట్‌రెడ్డి నగర్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.64 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ వ్యాప్తంగా ప్రతివార్డులో అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ఎజెండా అన్నారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సంధ్య జైపాల్‌రెడ్డి, జయమ్మ, ఏఈ కిష్టయ్య, నాయకులు జైపాల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సోను, కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

మాట్లాడుతున్న జిల్లా అధికారి సోమేశ్వర్‌రావు

జహీరాబాద్, అక్టోబర్ 1: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు ఆర్జించవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సోమేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని మామిడ్గి గ్రామంలోని రైతు వేదికలో ఉద్యానవన, వ్యవసాయశాఖ, గోద్రెజ్ ఆగ్రోవేట్ కంపెనీల ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు చేయాలనుకునే రైతులకు మొక్కలను 90శాతం రాయితీ, డ్రిప్ ఏర్పాటుకు 80 శాతం నుంచి వంద శాతం రాయితీ వస్తుందన్నారు. పంటను కంపెనీయే కొంటుందని, దీని కోసం న్యాల్‌కల్ మండలంలోని గంగ్వార్‌లో ఆయిల్ పామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కోహీర్ మండలం కొత్తూర్(డి)లో నర్సరీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బసంతపూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వరప్రసాద్, శైలజ, జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి, ఏవో అభినాశ్‌వర్మ, జిల్లా ఆగ్రోవేట్ కంపెనీ జిల్లా మేనేజర్ హేమకోండల్‌రెడ్డి, గోద్రెజ్ ఆగ్రోవేట్ కంపెనీ క్లస్టర్ ఇన్‌చార్జి రాజేశ్, ఫీల్డ్ ఆఫీసర్ గణేశ్, ఏఈవో సాయిలు పాల్గొన్నారు.

సింగూరుకు కొనసాగుతున్న వరద

పుల్కల్, అక్టోబర్ 1: బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు కొద్ది రోజులుగా ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు నీటి హెచ్చుతగ్గులను గమనిస్తూ నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సోమవారం నుంచి ప్రాజెక్టులోకి వస్తున్న వరద తీవ్రతను బట్టి ప్రాజెక్టు క్రస్ట్ గేటును 2 మీటర్లు ఎత్తి 5,367 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి కోసం జెన్కోకు 2,819 క్యూసెక్కులను వదులుతున్నారు. ఇన్‌ఫ్లో 9,034 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 8687 క్యూసెక్కులు ఉందని ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా పూర్తి నీటి మట్టం ఉన్నట్లు పేర్కొన్నారు.

జహీరాబాద్ డీటీగా పవన్‌కుమార్

జహీరాబాద్, అక్టోబర్ 1: జహీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్‌గా పవన్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. స్థానికంగా పనిచేసిన వంశీధర్ ఉద్యోగోన్నతిపై ఆర్డీవో కార్యాలయానికి డీఏవోగా బదిలీపై వెళ్లారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్‌గా పవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అల్గోల్ విద్యార్థులు

విద్యార్థులతో ఉపాధ్యాయులు

జహీరాబాద్, అక్టోబర్ 1: రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు జహీరాబాద్ మండలంలోని అల్గోల్ మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ రాములు తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన 68 ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల్లో అండర్ 14, 17 విభాగం ఖోఖోలో రాహుల్, మల్లేశం, అండర్ -17 విభాగం ఫుట్‌బాల్‌లో ఆర్మాన్, వాలీబాల్‌లో అఖిల్, హ్యాండ్‌బాల్‌లో మునీర్ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ఫిజికల్ డైరెక్టర్ ప్రశాంత్‌గౌడ్, పీఈడీ అనీల్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ కోఆర్డినేటర్ రాజలక్ష్మి, డిప్యూటీ వార్డెన్ సమీయొద్దీన్, జూనియర్ అసిస్టెంట్ ఇర్ఫాన్, సాగర్ పాల్గొన్నారు

మటన్ దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి

మటన్ షాపుల వద్ద ఫుల్ రష్

బుధవారం పెత్తరమాస(పెద్దల అమావాస్య)కు పెద్దలకు నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీ. అదే రోజు గాంధీ జయంతి ఉండడంతో మటన్ దుకాణాలు తెరుచుకోవు. దీంతో పెత్తరమాస కోసం మంగళ వారం రాత్రి 12గంటల వరకు జిన్నారంలోని మటన్ దుకాణాల వద్ద జనాలు మటన్ కోసం కిక్కిరిశారు. - జిన్నారం, అక్టోబర్ 1

డీఎస్సీ ర్యాంకర్‌కు సన్మానం

సిర్గాపూర్, అక్టోబర్ 1: మండలంలోని బొక్కస్ గాం గ్రామానికి చెందిన యోగేశ్వర్ డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటి జిల్లాస్థాయి ర్యాంకు సాధించాడు. దీంతో మంగళవారం స్థానిక పాఠశాలలో హెచ్ఎం నర్సింగ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాఠశాల పూర్వ విద్యార్థి యోగేశ్వర్‌ను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

బడిలో బతుకమ్మ సందడి

సంగారెడ్డి కలెక్టరేట్: తారా కళాశాలలో బతుకమ్మ వేడుక

అందోల్: జోగిపేటలో బతుకమ్మలతో విద్యార్థినులు

జిన్నారం: చెట్లపోతారం ప్రభుత్వ పాఠశాలలో..

విద్యాసంస్థల్లో ముందస్తు బతుకమ్మ సంబురాలను కనుల పండువగా జరుపుకొన్నారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకల్లో విద్యార్థినులు సందడి చేశారు. తీరొక్క పూలతో బతుకమ్మలను తయారు చేయడంలో పోటీ పడ్డారు. ఒక్కదగ్గర చేర్చిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ మురిసిపోయారు. విద్యార్థినులతో కలిసి ఉపాధ్యాయినులు సైతం ఆడిపాడారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, అక్టోబర్ 1

ఝరాసంగం: కుప్పానగర్ పాఠశాలలో..

జహీరాబాద్: హద్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

గుమ్మడిదల: బొంతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

కంది: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

కోహీర్: దిగ్వాల్ పాఠశాలలో..